

వేములవాడ: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు



చందుర్తి: కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



వేములవాడ: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, నాయకులు

- కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు
- వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు
- వేములవాడ పట్టణం, చందుర్తి మండలంలో ఇంటింటా ప్రచారం

వేములవాడ/చందుర్తి, అక్టోబ ర్27: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాధించిన ప్రగతిని చూసి మరోమారు పనిచేసే ప్రభుత్వానికి పట్టంకట్టాలని వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు కోరారు. గ్యారంటీ లేని వారంటీలతో వస్తున్న కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి మోసపోవద్దని.. మళ్లీ ఆ రోజులు రావద్దన్నారు. శుక్రవారం ఆయన చందుర్తి మండలంలోని ఎనుగంటి, బండపల్లి, మర్రిగడ్డ మూడపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, స్థానిక నేతలతో కలిసి ఇంటింటి ప్రచార నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేయాల ని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మహిళలు, యువకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ప్రచారానికి తరలివచ్చి బతుకమ్మలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో జరిగిన ప్రగతిని గుర్తు చేస్తూ, మెట్ట ప్రాంతమైన చందుర్తి మండలానికి గోదావరి జలాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. కేసీఆర్ పాలనలో అభివృద్ధి, సంక్షే మ ఫలాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని స్పష్టం చేశారు. 60ఏండ్ల కాంగ్రెస్ హయాంలో నీళ్లు, కరెంట్ లేక అష్టకష్టాలు పడ్డామని వాపోయారు. కాంగ్రెసోళ్లు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మకుండా, ఆలోచించి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లో సమస్యలను వింటూ, పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు.

### గులాబీ గూటికి చేరికల జోరు

ఇంటింటి ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయా గ్రామాలకు వెళ్లిన చల్మెడ సమక్షంలో తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ అడిగొప్పుల లక్ష్మితోపాటు గ్రామానికి చెందిన మహిళలు, యువకులు సుమారు 50మంది బీఆర్ఎస్‌లో చేరారు. అట్లాగే ఎన్గల్ గ్రామానికి చెందిన బీజేవైఎం సీనియర్ నేత గుంటి గంగాధర్, బోరుగాయ నవీన్‌తోపాటు 20మంది యువకులు, బండపల్లికి చెందిన 20మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరగా, జడ్పీ చైర్‌పర్సన్ నాల్యకొండ అరుణ, రాఘవరెడ్డి, చల్మెడ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, ఎంపీపీ బైరగోని లావణ్య, పార్టీ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, కేడీసీసీబీ డైరెక్టర్ జలగం కిషన్ రావు, ఏఎంసీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, ఆర్‌బీఎస్ డైరెక్టర్ బొప్ప వెంకన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ దప్పుల అశోక్, కోఆప్షన్ సభ్యుడు కమలాకర్, ఎంపీటీసీలు మాదాసు కవిత, దారం కావ్యశ్రీ, పెగ్గర్ల రమేశ్‌రావు, సర్పంచులు లింగంపల్లి స త్తయ్య, న్యాత విజయ, ఉప సర్పంచులు పులి మంజుల, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పుల్కం రవి, మా జీ సర్పంచులు సంటి బాపూరావు, జువ్వాడి అనిల్‌రావు, గ్రామశాఖ అధ్యక్షులు ఆకుల ఎల్లయ్య, వట్టి మల్ల లక్ష్మణ్, లింగంపల్లి తిరుపతి, బింగి స్వామి, దారం రాజు, కాపిల్ల శంకర్, సోష ల్ మీడియా కన్వీనర్ నీరటి కిరణ్, సీనియర్ నేతలు బైరగోని రమేశ్, ఈర్లపల్లి రాజు ఏరెడ్డి రాజిరెడ్డి, బద్ధం బాపురెడ్డి, సిరిగిరి సుధాకర్, లింగంపల్లి బాబు, కొండ లక్ష్మణ్, మల్యాల గంగ నర్సయ్య ఉన్నారు.

### అభివృద్ధికి ఆకర్శితులై..

సీఎం కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధికి యువత ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని ఆయన నివాసంలో కథలపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన సుమారు 20మంది యువకులు, తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన 30మంది యువకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, ఆయ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ దేవేందర్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బాలు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రావు ఉన్నారు.



చందుర్తి: బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా ప్రచారానికి హాజరైన మహిళలు

# బీజేపీలో టికెట్ లొల్లి..

- వికాస్‌కే ఇవ్వాలని నాయకుల తీర్మానం
- ఆయనకేం తెలువదంటున్న ఎర్ర మహేశ్



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వేములవాడ, అక్టోబర్ 27: భారతీయ జనతా పార్టీలో టికెట్ల లొల్లి రోజురోజుకూ ముదురుపోతున్నది. వేములవాడ అసెంబ్లీ స్థానానికి దాదాపు పదిమందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఎవరికి వారే ప్రయత్నాలు ముమ్మరం చేసినప్పటికీ మొదటి జాబితాలో మాత్రం స్థానం దక్కలేదు. రెండు రోజుల్లో రెండో జాబితా విడుదల అవుతుందన్న నేపథ్యంలో టికెట్ పంచాయతీ మరోసారి తెర మీదికి వచ్చింది. వేములవాడ టికెట్ డాక్టర్ చెన్నమనేని వికాస్ కేటాయించాలని నియోజకవర్గంలోని పార్టీ నేతలు, మండల నాయకులు శుక్రవారం వేములవాడలోని భీమేశ్వర గార్డెన్‌లో సమావేశమై మీడియాకు వెల్లడించారు. అయితే వేములవాడ స్థానానికి ప్రధానంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమా, బీజేపీ కిసాన్ సెల్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, జువ్వాడి వెంకటేశ్వర్‌రావు, ఎర్ర మహేశ్, అల్లాడి రమేశ్, పద్మ, ఇటీవలే పార్టీలో చేరిన డాక్టర్ చెన్నమనేని వికాస్ దాదాపుతో పాటు పది మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఎవరికి వారే టికెట్ పై ధీమా వ్యక్తం చేస్తుండగా, తాజాగా వేములవాడలో వికాస్‌కే టికెట్ ఇవ్వాలని నియోజకవర్గ నాయకుల తీర్మానం కొత్త పంచాయతీకి తెరలేపినట్లయింది. మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు తనయుడు వికాస్ వేములవాడ నుంచి పోటీ చేసేందుకు ఇటీవలే పార్టీలో చేరగా, ఆయనను ఎమ్మెల్యేగా నిలబెట్టేందుకు తండ్రి విద్యాసాగర్‌రావు ఢిల్లీలో లాబీయింగ్ చేసినట్టు తెలిసింది. వారసత్వ రాజకీయాలకు తావులేదనే బీజేపీలో లేదని ఎర్ర మహేశ్ విమర్శిస్తుండగా, వికాస్‌కే టికెట్ ఇవ్వాలని నాయకుల తీర్మానం పార్టీలో అంతర్గత కలహాలకు తెరలేపినట్లుగా తెలుస్తోంది. మరోవైపు ఈటల రాజేందర్ తుల ఉమకే ఇవ్వాలని పట్టుబడుతుండగా, ఏడాదికి పైగా నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేసుకుంటున్న ఆమె పోటీలో ఉంటూ తనకే టికెట్ వస్తుందని చెబుతోంది.

### కానరాని ఐక్యత..

టికెట్ ఎవరికి వచ్చిన తామంతా కలిసి పని చేస్తామని ఈ నెల 15న వేములవాడలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడిన నేతలు పది రోజులు గడవక ముందే అంతర్గత రాజకీయ వర్గాలకు తెరలేపారు. దాదాపు చెన్నమనేని వికాస్‌కే టికెట్ ఖరారు అయినట్లుగా తెలుస్తుండడంతో, పోటీలో ఉన్న నాయకులు తమ విమర్శలకు పదును పెట్టినట్లుగా తెలుస్తోంది.

## ఎన్నికలకు సహకరించాలి

చందుర్తి , అక్టోబర్ 27: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రజలు సహకరించాలని చందుర్తి సీఐ కిరణ్ కుమార్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, నేర చరిత కలిగిన వారిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇక్కడ ఎస్ఐ సిరిసిల్ల అశోక్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

బోయినపల్లి, అక్టోబర్ 27: అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామాల్లోని ఓటర్లందరూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా బీఎల్‌వోలు కృషి చేయాలని బోయినపల్లి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిణి పుష్పలత కోరారు. శుక్రవారం మండలంలోని బీఎల్‌వోలతో పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఓటు హక్కు సద్వినియోగంపై వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా వయస్సు మీరిన వారు ఇంటి వద్ద నుంచి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన పత్రాలను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో 41 పోలింగ్ కేంద్రాలున్నాయని తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లో విద్యుత్, తాగు నీరు, వృద్ధులు వీల్ చైర్‌లో కూర్చుని ఓటు వేసేందుకు ర్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లో ఇంకా ఎమైనా సమస్యలు ఉంటే తనకు రాత పూర్వకంగా రాసి ఇస్తే వెంటనే ఆ సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. 100 శాతం ఓటింగ్ అయ్యేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్ఐ ప్రభాకర్, సిబ్బంది బీఎల్‌వోలున్నారు.

## కమనీయంగా కౌముదినీపూజ



కౌముదినీ పూజను నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, అక్టోబర్ 27: లక్షీదేవిని కొలుస్తూ రాజన్న ఆలయంలో స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకుల వేదమంత్రాలమధ్య కౌముదినీ పూజను శుక్రవారం రాత్రి 10 నుంచి 12 గంటలవరకు కమణీయంగా నిర్వహించారు. దాదాపు 2 గంటలపాటు సాగిన ఈ కౌముదినీ పూజ భక్తులను ఆనందడోలికల్లో ముంచివేసింది. 12 పౌర్ణమిలలోగల ఆశ్వీయుజ పౌర్ణమిని కోజాగిరి పౌర్ణమి అంటారని, ఈ పూజలో పాలల్లో చంద్రున్ని దర్శనంచేసుకుంటా రని,చంద్రుడి లేలేత కిరణాలను పాలలో దర్శించుకుంటే జన్మధన్యమవుతుందని అర్చకులు పేర్కొన్నారు. ఈ రాత్రి ఏ సుహాసిని ఇంట్లో కోజాగిరి పౌర్ణమివేడుకులు జరుపుకుంటే వారి ఇంటికి లక్ష్మీ అమ్మవారు వస్తారని పురాణాలు చెబుతున్నాయని అర్చకులు చెప్పారు. దీంతో చంద్రుడు వారికి అష్టైశ్వరాలు ఇస్తాడని భక్తుల నమ్మకం. ఆలయంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో వేదపండితులు ,అర్చకులు,ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## ఫోన్ కాల్ పట్టించింది

- చెప్పాపెట్టకుండా ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ
- ఉండబట్ట లేక ఫోన్ చేసిన సత్తెమ్మ
- '100'కు ఫోన్ చేసిన బంధువులు
- పట్టుకుని కుమారుడికి అప్పగించిన పోలీసులు

వేములవాడ, అక్టోబర్ 27: చిన్నపాటి గొడవలతో మనస్తాపం చెంది ఇంటి నుంచి బయటకు వచ్చిన ఓ మహిళను ఫోన్ కాల్ పట్టించింది. వివరాల్లోకి వెళ్తే... సికింద్రాబాద్ చిన్న కందిగూడెం యాప్రాల్‌కు చెందిన పొన్నబోయిన సత్తెమ్మ ఇంట్లో ఈనెల 25న చిన్న పాటి గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె చెప్పాపెట్టకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. వేములవాడకు చేరుకుని రాజన్న ఆలయ పరిసరాలతో పాటు పట్టణంలో గడుపుతోంది. అయితే సత్తెమ్మ ఉండబట్టలేక బంధువుల క్షేమ సమాచారం తెలుసుకుందామని శుక్రవారం అల్లుడికి ఫోన్ చేసింది. దీంతో వెంటనే అప్రమత్తమైన బంధువులు '100'కు డయల్ చేసి ఆమె చేసిన సెల్ ఫోన్ నంబర్‌ను పోలీసులకు చెప్పారు. వెంటనే స్పందించిన పోలీసులు ఫోన్ నెంబర్ ఆధారంగా ఆమె ఉన్న చోటును గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయాన్ని బంధువులకు తెలపడంతో ఆమె కుమారుడు పవన్‌కుమార్ శుక్రవారం వేములవాడకు చేరుకొని తల్లిని చూసి ఆనందాన్ని వెలిబుచ్చారు. తక్షణమే స్పందించి తల్లిని అప్పగించిన రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ యంత్రంగానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్ సత్తమ్మను కుమారుడికి క్షేమంగా అప్పగించారు.